# సమాజసేవయే జీవిత పరమావధి

*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*విద్యలన్నియు నేర్చిన విలువ సున్న*
*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*దానధార్మాల సార్థకత సున్న*
*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*పదవులనేలిన ఫలము సున్న*
*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*బహుళ సత్కార్య లాభంబు సున్న*

*ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ*
*గుణములియ్యవి నాల్గు పునాదులప్ప*
*ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు*
*సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!*

ప్రేమస్వరూపులారా! మీరందరూ ఇక్కడికి దేనికోసం వచ్చారో దానిని మరచి పోతున్నారు. ఎక్కడికి వెళ్ళినప్పటికినీ "మనం ఎక్కడినుండి వచ్చాము?" ఎక్కడికి వచ్చాము? దేనికోసం వచ్చాము" అనే విషయాలను ఎప్పుడూ మరువకూడదు. మనం పోస్టు బాక్సులో వేసే కవరు మీద 'ఫ్రమ్ అడ్రసు', 'టు అడ్రసు' రెండూ లేకుండిన 'డెడ్ లెటర్ బాక్స్'కు చేరిపోతుంది. ఇప్పుడు మీరు 'ఫ్రమ్ అడ్రస్' 'టు అడ్రస్' తెలియకుండా ఈ ప్రపంచంలో వచ్చిపడ్డారు. "మనము ఎక్కడినుండి వచ్చాము? ఎక్కడికి పోతున్నాము? ఎక్కడ ఉన్నాము?" ఈ మూడింటిలో ఏదో ఒక అడ్రసునైనా మీరు గుర్తించాలి. ఏ ఒక్కటైనా గుర్తించుకోలేకపోతే మీ జీవితమే వ్యర్థమైపోతుంది.

**మీ జీవితాన్ని గంగపాలు చేసుకోకండి!**

ఒక చిన్నకథ: ఈస్టు గోదావరి, వెస్టు గోదావరి వంటి ప్రదేశాల్లో చాలామంది వ్యాపారస్థులు నది దాటటానికి పడవల్లో బయల్దేరిపోతుంటారు. ఒక పడవలో ఒక వ్యాపారస్థుడు వచ్చి కూర్చున్నాడు. ఆ పడవలో అతను తప్ప ఇంకెవ్వరూ ఎక్కలేదు. ఎక్కడికైనా ప్రయాణము చేసే వ్యక్తులు తోటివారితో ఏదో ఒకటి మాట్లాడుతూ వెళుతుంటే ఆ ప్రయాణపు బడలిక తెలియదు. అందుచేత, ఆ వ్యాపారస్థుడు కాలక్షేపంకొరకు పడవవానితో కబుర్లు ప్రారంభించాడు. "నాయనా! నీవద్ద న్యూస్ పేపర్ ఉన్నదా?" అని అడిగాడు. "నావద్ద పేపర్ లేదు సార్! నాకు చదువు రాదు" అన్నాడు పడవవాడు. అయ్యో! నీకు చదువు రాకపోతే నీ జీవితంలో పావుభాగం గంగలో కలసినట్లే! అన్నాడు వ్యాపారస్థుడు. పడవవాడు ఏమీ జవాబు చెప్పలేక మౌనం వహించాడు.

వ్యాపారస్థుడు మళ్ళీ కొద్దిసేపటికి "నాయనా! ఇప్పుడు వెండి, బంగారం ధరలు బొంబాయి మార్కెట్లో ఎలా ఉన్నాయో తెలుసా?" అని అడిగాడు. పడవవాడు "సార్! నాకు ఆ వ్యాపారములో ఏమీ అనుభవం లేదు. వెండి, బంగారు ధరలు ఎలా ఉన్నాయో నాకు తెలియదు" అన్నాడు. "వ్యాపారం గురించి నీకు తెలియకపోతే, నీ జీవితంలో సగభాగం గంగలో కలసినట్లే!" అన్నాడు వ్యాపారస్థుడు. ఆ సంభాషణ అంతటితో నిలిచిపోలేదు. పడవవాని చేతికి ఉన్న గడియారాన్ని గమనించి వ్యాపారస్థుడు "నాయనా! టైమెంత అయింది?" అని అడిగాడు.

అతడు చేతికి గడియారం కట్టుకున్నాడేకాని టైమ్ చూడటం అతనికి తెలియదు. "నాకు టైమ్ చూడడం తెలియదు సార్" అన్నాడు పడవవాడు. "మరి చేతికి వాచి కట్టుకున్నావే!" అని వ్యాపారస్థుడు అడుగగా "టైమ్ చూడటం తెలియనప్పటికీ, చేతికి వాచి కట్టుకోవటం ఈ కాలం ఫ్యాషన్" అన్నాడు పడవవాడు. "నీకు టైమ్ చూడటం కూడా తెలియకపోతే నీ జీవితంలో మూడు భాగాలు గంగలో కలిసినట్లే అన్నాడు వ్యాపారస్థుడు.

కొద్దిసేపటికి గాలి ఉధృతంగా వీచసాగింది. అలల తాకిడికి పడవ అటూ, ఇటూ ఊగసాగింది. సరంగు పడవను కంట్రోల్ చేయలేకపోయాడు. అప్పుడు అతను వ్యాపారస్థుని అడిగాడు "సార్! మీకు ఈత వచ్చునా?" అని. "నాకు ఈత రాదు" అన్నాడతను. "అయితే, మీ జీవితమంతా గంగపాలైనట్లే" అన్నాడు పడవవాడు. ఈనాడు మీ పరిస్థితి కూడా అదేవిధముగా ఉన్నది. మీరు ప్రపంచమనే నదిలో వచ్చి పడ్డారు. "ఇందులో మనం ఎందుకొచ్చి పడ్డాము? మనం ఏమి తెలుసుకోవాలి? ఎక్కడికి పోవాలి? ఏమి తెలుసుకుంటే మనం ఎక్కడికి చేరుతాము?" అనే విషయాలు మీరు తెలుసుకోవటం లేదు. ఎక్కడినుండి వచ్చామనే "ఫ్రమ్ అడ్రసు" ఎక్కడికి పోతున్నామనే "టు అడ్రసు" ఎక్కడున్నామనే "ప్రెజెంట్ అడ్రసు" ఈ మూడింటిని తెలుసుకున్నప్పుడే మీ జన్మ సార్థకమౌతుంది.

## ఎక్కడికి వెళ్ళినా భగవన్నామస్మరణ చేస్తూ ఉంటే ఏమాత్రం భయం ఉండదు

గోల్డ్‌స్టీన్ (ప్రశాంతి కౌన్సిల్ ఛైర్మన్), అతని భార్య అనేక పర్యాయములు పుట్టపర్తికి వచ్చారు. ఒకరోజు ఉదయం నేను కాలేజికి వెళ్తుంటే అతను నాతోపాటు కారులో వచ్చాడు. కారులో కూర్చున్నప్పుడు నేను గోల్డ్‌స్టీన్‌ను అడిగాను "ఏమిటి నీ ప్రోగ్రామ్?" అని. "స్వామీ! నేనీరోజు బయల్దేరి వెళ్ళాలి" అన్నాడు. "ఈ రోజు ప్రయాణం మానుకో" అని చెప్పాను. "స్వామీ! ఈరోజు వెళ్ళి బొంబాయిలో ఒక దినము ప్లేను కోసం వెయిట్ చేస్తాను" అన్నాడు. "అవన్నీ నీకు అనవసరం నేను పోవద్దు అంటే పోవద్దు. టికెట్ వేస్టు అయినా ఫరవాలేదు. పోవద్దు" అని కచ్చితంగా చెప్పాను. కాని అతను వెళ్ళి తీరాలని ప్రార్థించాడు. "నీ ఇష్టం" అన్నాను. వెళ్ళకపోతే టికెట్ వేస్టవుతుంది. కాని ఆరోజు ప్రయాణం చేస్తే తన జీవితమే వేస్టవుతుందని అతను గుర్తించుకోలేదు. సరే! పొమ్మని చెప్పాను.

ఇంటికి వెళ్ళి లగేజి సర్దుకొని భార్యభర్తలు కారులో బెంగుళూరుకు వెళ్ళారు. అక్కడ ప్లేనెక్కి బొంబాయిలో దిగారు. అక్కడి నుండి మరో ప్లేనులో అమెరికా బయలుదేరారు. ప్లేను బయలుదేరిన తర్వాత అందులో హైజాకర్లున్నారని తెలిసింది. ఇద్దరు హైజాకర్లు తలుపు దగ్గరున్నారు. మరో ఇద్దరు తుపాకీలతో అటూ, ఇటూ తిరుగుతున్నారు. ప్లేనులో పరిస్థితి చాలా అల్లకల్లోలంగా ఉండినది. అప్పుడు గోల్డ్‌స్టీన్‌కు తెలిసింది, స్వామి తనను ఆరోజు ఎందుకు ప్రయాణం చేయవద్దన్నారో! సరే ఏమైతే అయింది; స్వామే మాకు దిక్కని భావించి స్వామిపై భారంవేసి కూర్చున్నారు. అతని భార్య గొప్ప భక్తురాలు. ఆమె 'సాయిరాం! సాయిరాం! సాయిరాం!' అని స్మరిస్తూనే ఉన్నది.

కొంతసేపైన తర్వాత ప్లేనులో హైజాకర్లు కాల్పులు ప్రారంభించారు. ప్రయాణీకులు భయభ్రాంతులకు లోనయ్యారు. మీకు తెలుసు, గోల్డ్‌స్టీన్ చాలా లావుగా ఉండేవాడు. అతను, అతని భార్య ముందర సీట్లో కూర్చున్నారు. వాళ్ళ చుట్టూ ఉన్నవారిని హైజాకర్లు షూట్ చేస్తున్నారు. తరువాతి నిమిషంలో తమ వంతు వస్తుందేమో అని వాళ్ళు భయపడుతూ వచ్చారు. అప్పుడు గోల్డ్‌స్టీన్ తన భార్యతో చెప్పాడు "ఈరోజు స్వామి నన్ను పోవద్దన్నారు. కాని, నేను మొండితనంతో బయల్దేరాను. అందుకు ఫలితం అనుభవిస్తున్నాను" అని. ఒక హైజాకర్ దృష్టి వీళ్ళపై పడింది. గోల్డ్‌స్టీన్ భార్యవైపు అతను తుపాకీ గురి పెట్టాడు. ఆమె కళ్ళు మూసుకొని "సాయిరాం, సాయిరాం, సాయిరాం" అని తన్మయత్వంతో సాయినామం జపిస్తున్నది. దాంతో ఆ హైజాకర్ ఆమెను వదిలిపెట్టాడు. ఈవిధంగా వాళ్ళు చాలా సమయం హైజాకర్ల చేతుల్లో బందీలుగా ఉండవలసి వచ్చింది.

అన్న పానీయాలు లేవు, నిద్ర లేదు. ఈ చింతతోనే వాళ్ళు కుంగిపోయారు. గోల్డ్‌స్టీన్ భార్యకు భక్తి అధికము. సాధారణంగా స్త్రీలకు భక్తి ఎక్కువ. మగవారికీ ఉంటుంది భక్తి. కాని వారు పైకి చెప్పుకోలేరు. ఆమె భర్తతో చెప్పింది "మీరేమీ చింతచేయకండి. స్వామి చింతన చేసుకోండి" అని. హైజాకర్లు వీళ్ళని సీట్లలో కూర్చోమని చెప్పి, వీళ్ళ వెనుకనున్న సీట్లవద్దకు వెళ్ళారు. అక్కడున్న చిన్నచిన్న పిల్లలు, స్త్రీలు అందరూ ఆందోళన చెందారు. కాని, హైజాకర్లకి వాళ్ళ బాధ లెక్కా! నిర్దాక్షిణ్యంగా ఎందరినో కాల్చేశారు. ఆ తర్వాత పరిస్థితి మరింత భయానకంగా తయారైంది. గోల్డ్‌స్టీన్, అతని భార్య ఇరువురూ స్వామిని స్మరిస్తూనే ఉన్నారు. గోల్డ్‌స్టీన్ పైకి చెప్పలేదు కాని, మనస్సులో మాత్రం 'సాయిరాం, సాయిరాం, సాయిరాం' అని తలుచుకుంటూనే ఉన్నాడు. "ఈ హైజాకర్లు బారినుండి ఎప్పుడు విముక్తి లభిస్తుందా!" అని ఆందోళన చెందుతూ ఇద్దరూ కళ్ళుమూసుకొని కూర్చున్నారు.

హైజాకర్ల తుపాకీలలో ఉన్న మందుగుండు అంతా అయిపోయింది. పోలీసులు హైజాకర్లను పట్టి బంధించి వీరిని విడుదల చేశారు. ఈ సంఘటననుగురించి పోలీసులు తనను ప్రశ్నించినప్పుడు జవాబు చెప్పటానికి గోల్డ్‌స్టీన్‌కి గొంతు పెగల్లేదు. కన్నులు మూసుకొని స్వామిని తలుచుకుంటూనే ఉన్నాడు. ఆ ప్లేనునుండి వీళ్ళను క్రిందికి దింపారు. రెండవ దినము గోల్డ్‌స్టీన్, అతని భార్య ఇంకొక ప్లేనులో అమెరికాకు వెళ్ళి పోయారు. ఆ ప్లేనులో కూర్చున్నప్పుడు కూడా ఈ దుర్ఘటన తాలూకు చేదు అనుభూతి అతని కలిగింది. లోలోపల ఇంకా భయంగానే ఉన్నప్పటికీ దానిని మరచిపోవటానికి అతను ప్రయత్నము చేశాడు.

రెండు మూడు నెలల తర్వాత గోల్డ్‌స్టీన్ మళ్ళీ పుట్టపర్తికి వచ్చాడు ఎక్కడికి వెళ్ళినా, ఏమి చేసినా భగవన్నామస్మరణ చేస్తూ ఉంటే ఏమాత్రం భయం ఉండదని తాను అనుభవపూర్వకంగా గ్రహించాడు. ఇక్కడికి వచ్చి, స్వామిని దర్శించుకున్న తర్వాత అతనికి పూర్తి ధైర్యం వచ్చింది. నేను ప్రశ్నించాను "గోల్డ్‌స్టీన్! నీవు ఎప్పుడు తిరిగి వెళుతున్నావు?" అని. "స్వామీ! నేనేమీ ప్లాన్ చేసుకోలేదు. మీరెప్పుడు చెపితే అప్పుడు వెళతాను" అన్నాడు. సరే ఇంతమాత్రము తెలుసుకున్నావు కదా అని ఊరుకున్నాను. కొన్ని దినముల తర్వాత నేనే అతనికి తేదీ, టైము చెప్పి బయల్దేరమన్నాను. అప్పటినుండి గోల్డ్‌స్టీన్ దృఢమైన విశ్వాసంతో ఉక్కుగుండువలె నిలిచాడు.

## జీవితపరమార్థాన్ని గుర్తించండి

మానవజన్మ ఎందుకు వచ్చింది అని ప్రశ్నిస్తే, చాలామంది చెబుతుంటారు 'ఖానా, పీనా, సోనా, మర్నా' – ఇందుకోసమేనని. ఇది చాలా పొరపాటు. జీవితంలో మీరు చేయవలసినవి ఎన్నో ఉన్నాయి. మీరు వచ్చింది కేవలం తినటానికి కాదు, చదువుకోవటానికి కాదు. భోగభాగ్యాలను అనుభవించటానికి కాదు. మీరు వచ్చిన పని వేరే ఉంటున్నది. అది మీరు మరచిపోయినారు. వచ్చిన పని పూర్తిచేసుకోవాలి, మీ జన్మను సార్థకం చేసుకోవాలి. పాంచభౌతిక దేహము వస్తుంది, పెరుగుతుంది. అయితే ఈ పెరిగింది తరగక తప్పదు. ఇది తరిగేలోపునే జీవితాన్ని సార్థకం చేసుకోవటానికి కృషి చేయాలి. ఈ జీవిత ప్రయాణంలో మనకు అనేక ఒడుదుడుకులు ఎదురౌతుంటాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని భద్రంగా నిలిచే శక్తిని మనం సాధించాలి. అదే సరియైన ఆధ్యాత్మికబలము. మధ్యలో ఎటువంటి అవాంతరం వచ్చినా భయపడకూడదు. ఈ భవసాగరంలో అలలు ఉద్ధృతంగా వస్తూనే ఉంటాయి.

*పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం*
*ఇహ సంసారే బహు దుస్తారే కృపయా పారే పాహి మురారే*

అన్నారు ఆదిశంకరులవారు. తల్లిగర్భము నుండి పుట్టటం, చావటం... ఇందుకేనా మనం వచ్చినది? కాదు, కాదు.

మనం వచ్చిన పని చాలా గొప్పది. మనం చదివే చదువులను, చేసే పనులను, సంపాదించే ధనమును సార్థకం గావించుకొనే మార్గమును గుర్తించాలి. ఈనాటి విద్యార్థులు పొట్టకూటి నిమిత్తమై అనేక చదువులు చదువుతున్నారు. మీరు సర్కస్‌లో చూసే ఉంటారు, కోతులుకూడా అనేక విధములైన విద్యలను నేర్చుకోగలవు. మానవులుగా పుట్టిన మీరు కూడా కుక్కలు, నక్కలు, కోతులవలె ప్రవర్తిస్తే ఇంక విద్యను అభ్యసించి ప్రయోజనమేమిటి? నేర్చిన విద్యను మనం సద్వినియోగ పరచుకోవాలి. అప్పుడే అది సార్థకమవుతుంది; మనకు సరియైన బలమును అందిస్తుంది. మనం వచ్చింది కేవలం చదువుకోసం కాదు. అయితే, చదువుకోవాలి; మంచి డిగ్రీలు తీసుకోవాలి. కాని, డిగ్రీలు తీసుకున్నంత మాత్రాన చాలదు.

*చదివి వ్రాయనేర్చిన వారంతా విద్యావంతులేనా?*
*కాలేజీ డిగ్రీలను పొంద విద్యావంతులగునా*
*సుజ్ఞానము, సుకృతి లేక విద్యలు సద్విద్యలగునా*
*బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేవె పశుపక్షులు!*

జీవనోపాధితోపాటు జీవితపరమావధినికూడా లక్ష్యము నందు ఉంచుకున్నప్పుడే మనం చదివిన చదువు సార్థకమవుతుంది. కాని, ప్రతి మానవుడు తాను వచ్చిన పనిని లక్ష్యములో పెట్టుకోవాలి. 'నేను ఎమ్.బి.ఎ.పాసయ్యాను; దండిగా డిగ్రీలు పొందాను' అని గొప్పలు చెప్పుకుంటే ప్రయోజనమేమిటి? వాటిని సద్వినియోగం చేయాలి కదా! మొట్టమొదట మనము వచ్చినది ఎందుకో గుర్తించాలి. దీనిని గుర్తించుకునే శక్తి ఒక్క మానవునియందు మాత్రమే ఉన్నది. ఏదో వచ్చాము, బాగా డబ్బు సంపాదించాము, బ్యాంకులో పెట్టాము, పిల్లలను చదివించాము, వాళ్ళని ఫారిన్ పంపించాము. కాని, ఇంతమాత్రముచేత జీవితము సార్థకం కాదే! మీరు వచ్చినదెందుకో దానిని మరువకుండా ఉండాలి. కాని, ఈనాడు మీరు వచ్చిన పని ఒకటి, దానిని మరచిపోయి చేస్తున్న పని మరొకటి! మీరింకా ఈ ప్రపంచంలో ఉన్నారు. కట్టకడపటి వరకు మీరు శాంతిని అనుభవించాలి; సత్యనిత్యమైన ఆనందమును పొందాలి.
మంచిభావంతో సేవలు చేసేవారికి ఎప్పుడూ మంచే జరుగుతుంది.

మహాత్మా గాంధీ లండన్‌కి వెళ్ళి బారిస్టర్ డిగ్రీ పొందాడు. తాను చదివిన చదువును సమాజసేవలో సద్వినియోగపరచుకోవాలని ఆశించాడు. ఇండియా తిరిగి వచ్చిన తరువాత తాను కాంగ్రెస్‌లో ప్రవేశించి దేశస్వాతంత్ర్యంకోసం తన సర్వస్వాన్ని త్యాగం చేశాడు. ఎన్ని కష్టములు ఎదురైనప్పటికీ ఆయన తన దీక్ష విరమించుకోలేదు. ఆయన భార్య కస్తూరిబాయి చాలా గుణవంతురాలు. గాంధీ జైలులో ఉన్నప్పుడు కూడా ఆమె తన సేవాకార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంది. ఆ సేవలే ఆమెను అన్నివిధాలుగా రక్షిస్తూ వచ్చాయి. ఆ సేవలవల్ల, స్వాతంత్ర్య పోరాటంవల్ల భార్యాభర్తల మధ్య వియోగం సంభవించేది. కాని, ఏది జరిగినా 'ఇది నా మంచికోసమే' అనుకునేది కస్తూరిబాయి. ఈవిధంగా మంచి భావముతో మంచి సేవలు చేసేవారికి ఎప్పుడూ మంచే జరుగుతుంది. కట్టకడపటికి భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ తొలి ప్రధానమంత్రి అయ్యాడు. మంచి మనసు కలవాడు, మంచి సేవాతత్పరుడైన మరో వ్యక్తి సుభాష్‌చంద్రబోస్. దేశంకోసం దేహాన్ని త్యాగం చేయటానికి సిద్ధపడిన ఇటువంటి ఎందరో మహనీయుల కృషి ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది.

అయితే మనం కోరవలసింది కేవలం స్వాతంత్ర్యం మాత్రమే కాదు; 'స్వ' రాజ్యమును కోరాలి. అది హృదయంతో సాధించవలసినది. ఈ దేహం 'నేను' కాదు. ఇది కేవలం ఒక పనిముట్టు మాత్రమే. దీనితో మనం చేయవలసిన పని చేయాలి. త్యాగమువలన యోగము చేకూరుతుంది. దీనినే వేదం చెప్పంది – "నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః' అని. అమృతత్వం కావాలంటే మనం త్యాగానికి పూనుకోవాలి. మనం మానవులుగా పుట్టినందుకు మన జీవితాన్ని భగవదర్పితం గావించుకొని భగవచ్చింతన చేస్తూ కాలమును

సార్థకం గావించుకోవాలి. అప్పుడు దేహానికి ఎన్ని బాధలైనా కలగనీ, అవి మనలను బాధించవు.
మీకు ఆత్మాభిమానం నేర్పే నిమిత్తమే నేను ఇదంతా చేస్తున్నాను

ఒక చిన్న ఉదాహరణ మీకు చెబుతున్నాను. ఈ దేహము బెంగుళూరులో ఉన్నప్పుడు బాత్‌రూమ్‌లో పడిపోయింది. అక్కడ నా రూమ్‌లో సత్యజిత్, అచింత్య మొదలైన స్టూడెంట్స్ ఉండేవారు. వారు నాకు చాలా సేవలు చేశారు. నేను చెప్పాను “నాకు దేహాభిమానము లేదు. మీరు ఎంత ఆపరేషన్ చేసినా, ఎంత బ్యాండేజి కట్టినా, లేక ఈ శరీరాన్ని ముక్కలు చేసినా నాకు ఈ దేహంతో సంబంధం లేదు. ఈ దేహం ‘నేను’ కాదు.” అయితే, ఉండినంతవరకు నా పని నేను చేయాలి. నాకే కష్టమూ లేదు. చాలామంది భక్తులు ‘అయ్యో! స్వామి ఇలా నడుస్తున్నారే! ఏమి బాధ ఉందో ఏమిటో!’ అని ఏడుస్తుంటారు. కాని, నాకు ఎట్టి బాధలూ లేవు. ఈనాటి వరకు నేను జిలిఖిగి చీబిరిదీ (నొప్పి) అనేదే అనుభవించలేదు.

ఈవిధముగా దేహాభిమానమును పూర్తిగా త్యాగం చేస్తే మనము ఏదైనా సాధించవచ్చు. నేను ఏది చెబుతున్ననో అదే చేస్తున్నాను. చెప్పిందే చేయాలి; చేసిందే చెప్పాలి. “మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం” అదే నిజమైన మానవత్వం. డాక్టర్లు నాకు చెప్పారు ఎక్కువ టైమ్ నిల్చుకోకూడదని. కాని ఎంతసేపైనా నేను నిల్చుకోగలను. ఇప్పుడు కూడా నేను ఎంతోసేపటి నుండి నిల్చునే ఉన్నాను. నాకు ఏ బాధలూ లేవు. ఒక్క మాత్రైనా నేను వేసుకోను. ఒక్క కట్టు అయినా నేను కట్టుకోను. నాది కేవలం ఒకే ఆత్మభావము. ఆత్మాభిమానము మీకు నేర్పే నిమిత్తమే నేనిదంతా చేసి మీకు చూపుతున్నాను. ఈ ఆదర్శమును మీరు అనుసరించండి. దేహాభిమానమును త్యాగము చేయండి.

“ఇన్ని బాధలు పడుతున్నా స్వామి ఏమాత్రం తగ్గలేదే!” అని చాలామంది ఆశ్చర్యపడుతుంటారు. ముఖ్యంగా ఆడవాళ్ళు దీన్ని బాగా కనిపెడుతుంటారు. నేను తగ్గలేదు, ఎక్కలేదు. ఇప్పటికీ నేను స్పీడుగా నడవగలను. కాని ఈ డాక్టర్ల యొక్క భయమువల్ల ఆవిధంగా నడవటంలేదు. “స్వామీ! మీరు స్పీడుగా నడువకండి. పిల్లల నెవరినైనా ఇద్దరిని సహాయంగా పెట్టుకోండి” అని డాక్టర్లు ఒత్తిడి చేయటంవల్ల వాళ్ళను సంతృప్తిపరచే నిమిత్తమై నేను ఇద్దరు పిల్లల్ని పెట్టుకున్నాను. ఆ ఇద్దరికి కూడా నేను ఏమాత్రం ఇబ్బంది కల్గించటం లేదు. అరుణ్, పృష్టి వీళ్ళిద్దరూ అఫీసుకు వెళ్తుంటారు తర్వాత వచ్చి నా తలుపు దగ్గర కాచుకొని ఉంటారు. ఆ ఇద్దరుకూడా నాకు ఎంతో గొప్ప సేవ చేస్తున్నారు.

మీ దేహమును భగవత్సేవలో ప్రవేశపెట్టండి. భగవంతుడు దేహాన్ని ఇచ్చింది దేనికోసం? దైవసేవకు అర్పితం చేసే నిమిత్తమే! “దేహమింక నిశ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదము లాశ్రయింపవే!” హరిపాదములాశ్రయించండి మీరు. ఎన్ని బాధలు వచ్చినా లెక్కచేయకండి. దేశానికి మీ చేతనైన సేవలు చేయండి. సేవ చేయటానికి ప్రతి చిన్న అవకాశాన్ని కూడా మీరు వినియోగించుకోండి. దారిలో కనిపించే ముసలమ్మకు సహాయపడటం కూడా ఒక విధమైన సేవనే. “ఈమెకు సహాయపడటంవల్ల నాకేమి లాభం?” అని అనుకోవద్దు. అటువంటి చిన్న సేవలో కూడా పెద్ద ఫలితము ఉంటున్నది. కనుక మీరు సేవలు చేస్తూ రండి. సేవకు మించిన సాధన మరొకటి లేనే లేదు. “సేవ బినా నిర్వాణ నహీ” సేవలు చేయటంలో ఎటువంటి బాధలనైనా మనం లెక్కచేయకూడదు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీరు స్వామి పుట్టిన పండుగ జరుపుకుంటున్నారు. పుట్టినది ఈ దేహము. దీనికి 79వ సం॥ జరుగుతున్నది. కాని నేను 79 సం॥ల వయస్సు గలవానిగా కన్పిస్తున్నానా? లేదు. లేదు. ఇప్పుడే కాదు; 80,90 ఏళ్ళు వచ్చినా నేను ఇట్లనే ఉంటాను. నేను ఏమాత్రము పరాధీనము కాను. నా కాళ్ళూ, పళ్ళూ అన్నీ చక్కగా ఉన్నాయి. నాకు ముసలితనమనేది రానే రాదు. నాకు ఓల్డేజే లేదు. అట్టి విశ్వాసమును , ధైర్యమును మీరు కూడా సాధించండి. మీరందరూ మీ శరీరారోగ్యాన్ని కాపాడుకుంటూ మీ శక్తిని

సద్వినియోగం చేసుకోండి. స్వామి కృపచేత మీరు ఎంతైనా అభివృద్ధికి రాగలరు. ఎంతమందికైనా మీరు సహాయం చేయవచ్చును.

సేవ నిమిత్తమై మీరు దేహాన్ని భద్రంగా పెట్టుకోవాలి; అలంకారముకోసం కాదు. నాకుకూడా ఈ దేహము సేవ నిమిత్తమై కావలసినటువంటిదే. దేనికైనా నేను సిద్ధమే. అవసరమయితే నా ప్రాణాలివ్వటానికి కూడా నేను సిద్ధమే. ఆవిధంగా మీరు కూడా నిరంతరం 'రెడీ' గా ఉండాలి. దేహమే ప్రధానమని భావించకండి. అట్లని దేహమును వ్యర్థం చేసుకో కూడదు. దానిని సద్వినియోగపరచుకోవాలి. సేవలో జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. ఏ సమయంలోనైనా, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలి. అదే నిజమైన మానవత్వం. ఎవరికైనా అర్పితం కావాలంటే కూడా మనం సిద్ధంగా ఉండాలి. "ఐ యామ్ రెడీ! ఐ యామ్ రెడీ! ఐ యామ్ రెడీ!" ఇటువంటి ధైర్యాన్ని మీరు పోషించుకొని, లోకానికి ఆదర్శాన్ని అందించాలి. నా పుట్టిన పండుగను ఏదో గొప్ప వైభవంగా జరుపుకోవాలన్న ఆసక్తి నాకు లేదు. దేహానికి తగిన భద్రతను కల్పించి, దేహముద్వారా సేవలు చేయించాలన్నదే నా ఉద్దేశ్యము. సమాజానికి అర్పితం కావటానికి మనం సిద్ధంగా ఉండాలి.

(2004 నవంబరు 23వ తేదీ బాబావారి పుట్టినరోజు పండుగ ఉదయం సాయికుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)